నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పోచారం: సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టి నందున గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు సాయిప్రియ ఫీడర్ పరిధిలోని దివ్యానగర్ ఫేస్–1, 6, సుప్రభాత్ టౌన్‌షిప్, ఎంబీఆర్‌నగర్, సాయిప్రియకాలనీ, మీట్ ఫీడర్ పరిధిలోని మహాలక్ష్మీపురం, సప్తగిరికాలనీ, సురేందర్‌రెడ్డినగర్, బాబానగర్, గణేష్‌నగర్, నారపల్లి, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని వెంకటాద్రి టౌన్‌షిప్, చౌదరిగూడ, విజయపురికాలనీ, శివాజీనగర్, ఓయూ కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కలెక్టరేట్‌లో చలివేంద్రం ప్రారంభం



సాక్షి,సిటీబ్యూరో: ప్రజల దాహాన్ని తీర్చటానికి టీజీవోస్ అధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయటం శుభపరిణామమని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో టీజీవోస్ జిల్లా కమిటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. డీఆర్‌ఓ హరిప్రియ, టీజీవోస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్, కార్యదర్శి కురుమూర్తి, జిల్లా ప్రతినిధులు, వివిధశాఖల జిల్లా ఉన్నతాధికారులు విజయకుమారి, ఝాన్సీరాణి, గోపాల్‌రావు, సుగుణబాయి, రాధిక, శివప్రసాద్, సంతోష్, కలెక్టరేట్ విభాగంలోని ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో లేఔట్ ప్లాట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కల్పించిన ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ అన్నారు. బుధవారం కీసర వార్డు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ అధికారులు 2020లో స్వీకరించిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను మార్చి 31 వరకు క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

గస్తీని పెంచాలని ఇన్‌స్పెక్టర్‌కు వినతి



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కాలనీల్లో తరచూ జరుగుతున్న దొంగతనాల నివారణకు రాత్రి వేళల్లో పోలీసుల గస్తీని పెంచాలని బుధవారం నాగారం మున్సిపల్ జేఏసీ అధ్యక్షుడు జయకుమార్, ఉపాధ్యక్షులు జితేందర్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యులు సాయినాథ్‌గౌడ్‌లు కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు జేఏసీ అధ్యక్షుడు జయకుమార్ తెలిపారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి సాంబశివరావు



సాక్షి,సిటీబ్యూరో: సామాజిక సేవలో ఉద్యోగ విరమణ పొందిన వారు తమ వంతు కర్తవ్యంగా పలు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి సాంబశివరావు అన్నారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో ఉద్యోగ విరమణ పొందిన జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ సీనియర్ ఫొటోగ్రాఫర్ కిషోర్‌బాబును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సత్కార సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ఏదో ఒకరోజు పదవీవిరమణ పొందాల్సిందేనన్నారు. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా పౌర సంబంధాల శాఖ ఇన్‌చార్జ్ అధికారి స్వర్ణలత, ఐఅండ్ పీఆర్ ఇంజినీరింగ్ విభాగం అధికారి ఏడీ నాగాంజలి మాట్లాడుతూ.. సీనియర్ ఫోటోగ్రాఫర్‌గా కిషోర్‌బాబు మూడు దశాబ్దాలుగా సమాచార శాఖలో పనిచేసి మంచి గుర్తింపును తెచ్చుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రామ్మోహన్, కలెక్టర్ సీసీలు చందన్, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది, పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

పిల్లర్ల వరకే పరిమితమైన ఫ్లై ఓవర్ పనులు



రహదారి పూర్తయ్యేదెన్నడో ?

- ఓవైపు నిర్మాణ పనులు, మరోవైపు ట్రాఫిక్‌తో తిప్పలు
- అత్వెల్లి నుంచి చెక్‌పోస్టు వరకు నరకం చూస్తున్న వాహనదారులు

మేడ్చల్ పట్టణం మీదుగా వెళ్లే జాతీయ రహదారిపై వెళ్లాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. గతేడాది నుంచి మేడ్చల్‌కు రావాలంటేనే ప్రజలు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది.



జాతీయరహదారిపై నిలిచిపోయిన వాహనాలు

మేడ్చల్: మేడ్చల్ మీదుగా వెళ్లే 44వ జాతీయ రహదారి వాహనాల రద్దీకి సరిపోకపోవడంతో ఎన్‌హెచ్ఏఐ అధికారులు మేడ్చల్‌లో విస్తరణ పనులు చేపట్టి రోడ్డును ఆధునికరిస్తున్నారు. విస్తరణ, అండర్‌పాస్‌ల నిర్మాణం, ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టారు. నగరంలోని బోయినపల్లి నుంచి మెదక్‌జిల్లా కాళ్ళకల్ వరకు గతేడాది పనులు చేపట్టారు.

రెండు భాగాలుగా పనులు..

కండ్లకోయ రింగు రోడ్డు జంక్షన్ నుంచి బోయిన్‌పల్లి వరకు ఓ భాగం, కండ్లకోయ నుంచి కాళ్ళకల్ వరకు మరో భాగంగా పనులు చేపట్టారు. మేడ్చల్ పట్టణం నడిబోడ్డు నుంచి రోడ్డు వెళ్తుండటంతో అధికారులు విస్తరణ చేపట్టారు. విస్తరణ పనులు పూర్తిచేసి ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం చేస్తున్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణానికి 72 పిల్లర్లు..

మేడ్చల్ ఐటీఐ నుంచి చెక్‌పోస్టు వరకు ఫ్లై ఓవర్ నిర్మించడానికి 72 పిల్లర్ల నిర్మాణం రోడ్డు మధ్యలో చేశారు. కండ్లకోయ వద్ద , ఈఎంఆర్ఐ, అత్వెల్లి, రేకులబావిల వద్ద అండర్‌పాస్ బ్రిడ్జిల నిర్మాణం, బ్రిడ్జిల విస్తరణ పనులు చేపట్టారు.

నిత్యం ట్రాఫిక్‌జామ్..

రోడ్డు పనులు జరుగుతుండటంతో అత్వెల్లి నుంచి చెక్‌పోస్ట్ వరకు నిత్యం ట్రాఫిక్‌జామ్ అవుతుంది. ప్రధానంగా ఉదయం సాయంత్రం గంటల తరబడి వాహనాలు కదలడం లేదు. కాంట్రాక్టర్ పనుల నిర్మాణం భాగంగా రోడ్డు మధ్యలో పిల్లర్లు నిర్మించి బారికేడ్లు ఏర్పాటు చేశారు. నిర్మాణం జరుగుతున్న కండ్లకోయ రింగురోడ్డు జంక్షన్ నుంచి బోయిన్‌పల్లి వరకు వాహనాలు వెళ్లి ప్రమాదాలు జరగకుండా ఇనుపరేకులు అడ్డంగా పెట్టి పనులు చేస్తున్నారు. దీంతో 4 లైన్ల రోడ్డు సింగిల్‌లైన్ రోడ్డుగా తయారైంది.

ప్రత్యామ్నాయం లేకపోవడంతో ఇబ్బందులు..

రోడ్డుకు ఇరువైపులా నూతన రోడ్డు నిర్మించకపోవడం, పట్టణంలో ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్న పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం..

రద్దీ సమయాల్లో ఉదయం, సాయంత్రం మేడ్చల్ పట్టణంలో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. జాతీయరహదారి కావడంతో భారీవాహనాల సంఖ్య ఎక్కువగా ఉండటం, స్కూల్ బస్సులు, ఇతర వాహనాలు అధికంగా ఉండటంతో ట్రాఫిక్ నిలిచిపోతుంది.

చలాన్లకే ప్రాధాన్యం..

ట్రాఫిక్ పోలీసులు అక్కడక్కడ కనిపిస్తూ ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నా అధికంగా చలాన్లు వేయడానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పెరుగుతున్న వాయు కాలుష్యం..

బీటీరోడ్డు పూర్తిగా లేకపోవడంతో దుమ్ము రేగుతోంది. వాహనాల తాకిడికి నేలపై ఉన్న దుమ్ము గాల్లో కలుస్తుంది. ఎప్పటికప్పుడు నీళ్లు పోయాల్సి ఉండగా నామమాత్రంగా అక్కడక్కడ నీళ్లు పోసి వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి.

తప్పని ఇబ్బందులు..

రేపటి కష్టాలను తీర్చడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారిని అభివృద్ధి చేస్తున్నప్పటికీ కాంట్రాక్టర్ సకాలంలో పనులు పూర్తిచేయకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

నత్తనడకన పనులు..

మేడ్చల్ రోడ్డు ఆధునీకరణ పనులు మార్చిలో ముగియాల్సి ఉండగా 50శాతం పనులు సైతం పూర్తి కాలేదు. కేవలం పిల్లర్ల నిర్మాణం పూర్తి కాగా మిగిలిన పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. రహదారి పనుల జాప్యంపై ఎంపీ ఈటల రాజేందర్ అధికారులు, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీక్ష నిర్వహించి పనులు నవంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ప్రశాంతంగా 'మొదటి' పరీక్షలు



మేడ్చల్: ఇంటర్మీడియట్ పరీక్షలు తొలిరోజు మేడ్చల్‌లో ప్రశాంతంగా జరిగాయి. మేడ్చల్ పట్టణ పరిధిలో 6 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 383 మందికి, 350 మంది హాజరయ్యారు. రెడ్సన్ జూనియర్ కళాశాల కేంద్రంలో 207 మందికి 231, హయాతీ కళాశాల కేంద్రంలో 373 మందికి 335, స్ఫూర్తి జూనియర్ కళాశాలలో 340 మందికి 313, ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో 440 మందికి 420, జాగృతి జూనియర్ కళాశాలలో 237 మందికి 233 మంది హాజరయ్యారు.

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పట్టణంలో రుషి, శ్రీచైతన్య, వివేకానంద జూనియర్ కళాశాల, అవుషాపూర్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రీడల్లో బాలికలకు సముచిత స్థానం



క్రీడాకారిణులతో కార్యదర్శి మనోహర్‌రెడ్డి

ఘట్‌కేసర్: క్రీడల్లో బాలికలకు సముచిత స్థానం ఇవ్వాలని, వారు పురుషులతో సమానంగా విజేతలుగా నిలుస్తున్నారని విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల (వీబీఐటీ) కార్యదర్శి మనోహర్‌రెడ్డి అన్నారు. కొంపెల్లిలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఉల్‌క్రిస్ట్–2025 రాష్ట్రస్థాయి బాలికల బాస్కెట్‌బాల్ టోర్నీలో ప్రథమస్థానంలో నిలిచిన వీబీఐటీ క్రీడాకారిణులను అవుషాపూర్‌లోని కళాశాలలో బుధవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో యువతలో ఐక్యతాభావం పెరుగుతుందని, మానసిక, శారీరకంగా ధృఢత్వం వస్తుందన్నారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాదరావు, ఈఈఈ హెచ్ఓడీ నీలిమా, సివిల్ హెచ్ఓడీ రామకృష్ణ, పీడీ శ్రీనివాస్‌రెడ్డి, సహాయ పీడీలు శివలాల్, వినోద్, వెంకటేష్, పాషా, క్రీడాకారులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్‌మీట్‌లో విద్యార్థుల ప్రతిభ

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎస్ఆర్ఈసీ కళాశాలలో నిర్వహించిన జాతీయస్థాయి అంతర్–కళాశాలల స్పోర్ట్స్‌మీట్‌లో సెయింట్ పీటర్స్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. పలు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచి కబడ్డీ పోటీలో కళాశాల జట్టు విజేతగా నిలువగా 100 మీటర్ల పరుగు పందెంలో వరలక్ష్మి, షాట్‌పుట్ ఈవెంట్‌లో హరివిజయ్ స్వర్ణ పతకం సాధించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ టీవీ.రెడ్డి, డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత, పీఆర్వో రవి సుధాకర్, ఫిజికల్ డైరెక్టర్ వెంకటనారాయణ విజేతలను సన్మానించి అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

కళాకారుల సమస్యలపై అలుపెరగని పోరాటం



జవహర్‌నగర్: కళాకారుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తామని తెలంగాణ కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మోహన్ బైరాగి, వెంకటాచారిలు అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన తెలంగాణ కళాకారుల వేదిక రాష్ట్ర స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులుగా మోహన్ బైరాగి, కార్యదర్శిగా జవహర్‌నగర్‌కు చెందిన వెంకటాచారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటాచారి మాట్లాడుతూ.. గత 30 ఏళ్లగా ప్రజాఉద్యమాలతో అలుపెరగని పోరాటం చేస్తూ సమస్యలు పరిష్కారం అయ్యేలా కృషి చేస్తున్నామన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

ఘట్‌కేసర్: ఏదులాబాద్‌లో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీశైలం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నీటి సరఫరాపై వార్డు అధికారితో చర్చించారు. వేసవిలో నీటి సమస్య రాకుండా చూడాలని, దీనిపై ముందస్తు ప్రణాళికతో ముందకెళ్లాలని సూచించారు.

జూదరుల అరెస్ట్

ఘట్‌కేసర్: పేకాడుతున్న వ్యక్తులను ఘట్‌కేసర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం అడ్మిన్ ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌లోని ఓ ఇంట్లో తీన్‌పత్తా ఆడుతున్న 8 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 26,430 నగదు, 8సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



రజనీకాంత్‌రెడ్డి (ఫైల్)

కీసర: ఆర్థిక ఇబ్బందులతో ఓ రేషన్ డీలర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధి తిమ్మాయిపల్లిలో చోటు చేసుకుంది. కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం తిమ్మాయిపల్లికి చెందిన గూడూరు రజనీకాంత్‌రెడ్డి (38) రేషన్‌డీలర్‌గా పనిచేస్తున్నాడు. గత కొద్దిరోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు సెల్‌ఫోన్ ఆఫ్ చేసుకుని ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు రాత్రంతా ఆచూకీ కోసం వెతికారు. బుధవారం తెల్లవారుజామున అతడు సెల్‌ఫోన్ నుంచి భార్యకు ఫోన్ చేసి పిల్లలతో మాట్లాడి వెంటనే స్విచ్ఛాఫ్ చేశాడు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు ధర్మారం సమీపంలోని గుట్టలోకి వెళ్లారు. అప్పటికే పురుగుల మందు తాగి మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వీధి కుక్కదాడిలో ఇద్దరికి గాయాలు



గాయాలు చూపుతున్న బాధితురాలు

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ కీసర వార్డు పరిధిలోని వన్నిగూడలో వీధి కుక్కదాడిలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల ప్రకారం వన్నిగూడ గ్రామానికి చెందిన పండుగ సత్తమ్మ, పండుగ నవీన్‌లపై బుధవారం ఉదయం వీధికుక్క ఒక్కసారిగా దాడిచేసి గాయపరిచాయి. బాధితులను చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు కోఠిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీధి కుక్కల బెడద నుండి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పేదలు ఇల్లు నిర్మించుకుంటే రూ.5 లక్షలు



ఘనాపూర్‌లో 27 ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేస్తున్న వజ్రేష్‌యాదవ్, సుధీర్‌రెడ్డి, మహేష్‌గౌడ్

ఘట్‌కేసర్: సొంతింటి స్థలం ఉండి ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటికి రూ. 5 లక్షలు అందజేస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్ అన్నారు. ఘనాపూర్‌లో 27 ఇందిరమ్మ ఇళ్లకు మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్యతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచులు గోపాల్‌రెడ్డి, యాదగిరియాదవ్, రూప్‌సింగ్, మమతగౌడ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్, అనిత, లతరెడ్డి, శివాజీనాయక్, రాజుగౌడ్, నర్సింగ్‌రావు, రమేష్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం..

ఘట్‌కేసర్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కగానే ఇందిరమ్మ ఇళ్లను కేటాయించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఘనాపూర్ కాంగ్రెస్‌శాఖ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

శామీర్‌పేట్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్‌లు అన్నారు. బుధవారం మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఇటీవల మంజూరైన రూ. 3.60 లక్షలతో యూజీడీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల కోసం 6 గ్యారెంటీలను అమలు చేస్తుందన్నారు. నియోజకవర్గానికి సుమారు 3500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించిందని చెప్పారు. కేశవరం గ్రామానికి 105 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని వివరించారు. మాజీ వైస్ ఎంపీపీ మంద శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోనె హన్మంతరెడ్డి, వెంకటేష్, బాలనర్సింహ, విశ్వేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సాక్షి,సిటీబ్యూరో: విధుల నిర్వహణలో భాగంగా అనునిత్యం ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులకు ఆటల పోటీలు మానసిక ఉల్లాసం, శరీర దారుఢ్యాన్ని పెంచేందుకు ఎంతగానో దోహదపడుతాయని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో టీజీవోస్ జిల్లా కమిటీ అధ్వర్యంలో మహిళా అధికారులు, ఉద్యోగులకు నిర్వహించిన ఆటల పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. మహిళా క్రీడోత్సవాల్లో భాగంగా మహిళా అధికారులు, ఉద్యోగులకు నృత్యం, పాటలు, చెస్, క్యారమ్స్, తాడు లాగటం, షటిల్ తదితర ఆటల పోటీలను నిర్వహించారు. పోటీల్లో డీఆర్ఓ హరిప్రియ, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, బీసీ అభివృద్ధిశాఖ జిల్లా అధికారి ఝాన్సీరాణి, ఉపాధి కల్పన జిల్లా అధికారి రాధిక, టీజీవోస్ జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్, కార్యదర్శి కురుమూర్తి, జిల్లా క్రీడలు, యువజనశాఖ అధికారి గోపాల్‌రావు, ఎల్‌డీఎం శివప్రసాద్, టీజీవోస్ జిల్లా నేతలు రవీందర్, సంతోష్ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించండి



కమిషనర్ వీరారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

పోచారం: ప్రతాపసింగారంలోని మల్లిఖార్జుననగర్ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ వీరారెడ్డికి సీపీఎం నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. తాగునీరు, డ్రైనేజీ, వీధిదీపాలు, దోమల సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. సీపీఎం నాయకులు చింతల యాదయ్య, సబిత, ఆనంద్‌గౌడ్, సూరజ్, రవీంద్ర, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన

ఘట్‌కేసర్: ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రారంభమైన నేపథ్యంలో ఘట్‌కేసర్ బైపాస్ చౌరస్తాలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కల్పించారు. పిల్లలు, లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇవ్వకూడదని, హెల్మెట్ లేకుండా వాహనం నడపరాదని, త్రిబుల్ రైడింగ్ చేయకూడదని సూచించారు. వేగం ముఖ్యం కాదని గమ్యం చేరుకోవడమే ప్రధానమని చెప్పారు. ట్రాఫిక్ ఎస్సై మల్లయ్య, సిబ్బంది పాండు, ఇబ్రహీం, వాహనదారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఎస్సై మల్లయ్య

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

జవహర్‌నగర్: భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేష్(22), భార్య రమ్య (22) డిగ్రీ చదువుకుంది. వీరు 2024 ఫిబ్రవరిలో ప్రేమ వివాహం చేసుకొని జవహర్‌నగర్ కార్పొరేషన్ ముత్తుస్వామి కాలనీలో నివాసం ఉంటున్నారు. మహేష్ జల్సాలకు అలవాటు పడి మద్యానికి బానిసై డబ్బులకోసం భార్యను ఇబ్బందులకు గురిచేస్తూ వేధింపులకు పాల్పడ్డాడు. ఈనెల 4న మహేష్ పుటుగా మద్యం తాగి భార్య రమ్యతో గొడవపడి వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపానికి గురైన రమ్య మంగళవారం రాత్రి ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంటికొచ్చిన భర్త తలుపులు పగులగొట్టి చూడగా భార్య సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేయగా పరీక్షించిన సిబ్బంది అప్పటికే ఆమె మృతిచెందిందని చెప్పారు. తమ కుమార్తెను భర్త వేధింపులకు గురిచేయడంతోనే ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలపై పట్టింపేది !

- పంచాయతీలు, పురపాలికల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన
- పరిష్కారానికి నోచుకోని సమస్యలెన్నో..
- ఆగని అక్రమ నిర్మాణాలు, పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం

సాక్షి,సిటీబ్యూరో: పురపాలక సంఘాలు, పంచాయతీలు స్పెషల్ ఆఫీసర్ల పాలనలో కొనసాగుతుండగా.. ప్రజలు పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. నిధుల లేమితో పంచాయతీలో అభివృద్ధి పనులు, మరమ్మతులకు ఆటంకం కలుగుతోంది. పురపాలక సంఘాల్లో కూడా ప్రత్యేకపాలన ఇష్టానుసారంగా సాగుతోందనే విమర్శలున్నాయి. పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసి 13 నెలలుగా కావస్తుండగా, పురపాలక సంఘాల్లో 40 రోజులుగా ప్రత్యేక పాలన కొనసాగుతోంది.

జీపీల్లో ప్రత్యేక పరిస్థితి..

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని 34 జీపీల్లో పారిశుద్ధ్య కార్మికుల జీతాలు, పైపుల లీకేజీకి మరమ్మతు, బోర్ల మరమ్మతు పనులు, జీపీల్లో ట్రాక్టర్లకు సంబంధించి బ్యాంకులకు నెలనెలా బకాయిలు, విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉండగా, ఈ బాధ్యతలపై ప్రత్యేక అధికారులు చేతులెత్తేసే తరహాలో ఉండటంతో కార్యదర్శులే కార్మికులకు సగం జీతం సర్దుబాటు చేస్తున్నట్లు సమాచారం.

◆ పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్లకు తోడు జిల్లా పంచాయతీశాఖకు జిల్లా అధికారి లేక ఇన్‌చార్జ్ పాలనలో నడుస్తుండటంతో భారమంతా కార్యదర్శులపైనే పడుతోంది. 4 రోజులు ఉండిపోయే వాళ్లమని ప్రత్యేక అధికారులు దాట వేస్తుంటంతో ఇబ్బందులు తప్పటం లేదని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పురపాలక సంఘాల్లో సమస్యలు అంతే..

జిల్లాలో 13 పురపాలక సంఘాలు ఉండగా, ఇటీవల వీటిలో 7 పురపాలక సంఘాల్లో 28 గ్రామ పంచాయతీలు విలీనమయ్యాయి. వీటిలో బర్త్,డెత్, మ్యారేజ్ సర్టిఫికెట్ల (ధ్రువీకరణ పత్రాలు)తో పాటు ఇంటి అనుమతులు, ఇంటి నంబర్లు, మ్యూటేషన్లు, నల్లా అనుమతులు పొందటానికి స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం 6 గంటలు దాటితే చాలు.. పలు కాలనీలు, బస్తీల్లో ఐదు నిమిషాలు కూడా బయట నిలబడలేకపోతున్నామని ప్రజలు అంటున్నారు.

పాలకవర్గం లేక...

పురపాలక సంఘాలు, గ్రామపంచాయతీల్లో ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించినప్పటికీ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడనే చందంగా తయారైంది. పారిశుద్ధ్య కార్మికులకు నెలనెలా జీతాలు అందడం లేదు.

అక్రమ కట్టడాలపై..

ప్రభుత్వ, అస్సైన్డ్ భూములు, పార్కు స్థలాల్లో జోరుగా అక్రమ కట్టడాలు ,లేఅవుట్లు కొనసాగుతున్నా.. ప్రత్యేకాధికారులను పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

ఫిర్యాదులు వస్తేనే కదలిక..

ప్రజలు, అసోసియేషన్లు, పలు సంఘాల నుంచి ఫిర్యాదులు వస్తేనే పురపాలక, పంచాయతీ శాఖలు కూల్చివేతలకు దిగుతున్నాయి. లేదంటే పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. స్పెషల్ ఆఫీసర్లు పర్యవేక్షణ లేకపోవటంతో పురపాలక సంఘాలు, జీపీల్లోని పలువురు సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.